అయినా.. చర్యలు శూన్యం!

- విద్యుత్ మోటార్లు, తీగల దొంగలను పోలీసులకు పట్టిచ్చిన రైతులు
- ఆరు రోజుల పాటు విచారించి.. కాగితాలు ఏరుకునేవారని తేల్చిన వైనం
- నేటి వరకు రికవరీకి నోచుకోని మోటార్లు
- మూడు మండలాల పరిధిలో వందలాది మోటార్లు చోరీ
- ఆయా స్టేషన్ల పరిధిలో పదుల సంఖ్యలో కేసులు పెండింగ్



పట్టుబడిన దొంగల నుంచి రైతులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ తీగలు

జూపాడుబంగ్లా: పైర్లకు నీరుపారించుకునే మోటార్లు, విద్యుత్ తీగలు ఒక్కొక్కటిగా చోరీకి గురవుతుండటంతో రైతులు కంటి మీద కునుకులేకుండా పొలాల వద్ద రాత్రిళ్లు కాపలాకాసి దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే వారం గడిచినా వారిని విచారించి మోటార్లు రికవరీ చేయకుండా కాలయాపన చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దొ పట్టించినా తమకు న్యాయం చేయడంలో పోలీసులు విఫలమయ్యారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులిస్తామని ఆఫర్..

రాత్రి వేళల్లో కాపుకాసి ఎట్టకేలకు తూడిచెర్ల గ్రామ పొలాల్లో మోటార్లు దొంగతనం చేయటానికి వచ్చిన దోర్నాలకు చెందిన కిన్నెరబాబు, మేరిబాబులతో పాటు పి.లింగాపురం గ్రామానికి చెందిన రాజేష్‌లను రైతులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ సమయంలో తమను వదిలిపెడితే ఒక్కొక్కరికి రూ.20వేలు ఇస్తామని దొంగలు ఆశచూపారని, అయినా తమ మోటార్లు ఇస్తే చాలంటూ వారిని ఈనెల 18న జూపాడుబంగ్లా పోలీసులకు అప్పగించామని రైతులు తెలిపారు. వారిని విచారిస్తుండగానే ఈనెల 21న ఇద్దరు మహిళలు, ఓ యువకుడు విద్యుత్ మోటార్ల వద్దవున్న విద్యుత్ తీగలను కత్తిరించుకొని వెళ్తుండగా తూడిచెర్ల పాశ్వాన్ వంక సమీపంలో రైతులు పట్టుకున్నారు. వారు కూడా వదిలిపెడితే డబ్బులిస్తామని కాళ్లావేళ్లా పడ్డారు. వారిని కూడా రైతులు పోలీసులకు అప్పగించారు.

దొంగలను చిత్తుకాగితాలేరుకునేవారని..

రైతులపై కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టి వారి నుంచి మోటార్లు, విద్యుత్ తీగలను రికవరీ చేసి రైతులకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే దొంగలను వారం రోజులపాటు విచారణచేసి మోటార్లను రికవరీ చేయకుండా కాలయాపన చేశారనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా విద్యుత్ తీగలను కత్తిరించి దొంగతనాలకు పాల్పడిన వారు చిత్తుకాగితాలు ఏరుకునే వారని పేర్కొంటూ ఈనెల 25న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ వద్ద బైండోవర్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వంద మోటార్లు చోరీ

జూపాడుబంగ్లా మండలలోని తరిగోపుల, పి.లింగాపురం, తూడిచెర్ల, రామసముద్రం, మండ్లెం, తరిగోపుల, తంగడంచ, గ్రామాలతో పాటు పాములపాడు మండలంలోని మిట్టకందాల, వాడాల, ఏబీఆర్ కాల్వ వెంట ఉన్న గ్రామాలు, మిడుతూరు మండలంలోని అలగనూరు, చెరుకుచెర్ల తదితర గ్రామాల్లో వంద మోటార్ల మేర చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. మోటార్ల చోరీకి సంబంధించి జూపాడుబంగ్లా, మిడుతూరు, పాముల పాడు పోలీసుస్టేషన్‌లలో పదుల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

చోరీలు కొనసాగించే అవకాశం

పట్టించిన దొంగలను వదిలిపెడితే వారి తమకపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారు మళ్లీ మోటార్ల దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించాం



పొలం వద్దనున్న నా మోటారు, విద్యుత్ తీగలను దోచుకెళ్లారు. నాతోపాటు చాలామంది రైతులవి కూడా ఎత్తుకెళ్లారు. దీంతో నేను పొలంలో సాగుచేసిన పంటలకు నీళ్లు పారించుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యాను. రూ.50వేలు వెచ్చించి కొత్త మోటారు తీగలు తెచ్చుకొని బిగించుకొని పొలానికి నీళ్లు పారించుకున్నాను. పొలాల వద్ద రేయింబవళ్లు కాపలాకాసి మోటార్ల దొంగలను ఈనెల 18న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఎస్‌ఐకి అప్పగించాం. అయినా వారు మాకు న్యాయం చేయలేదు.

– బోయశివన్న, రైతు, తూడిచెర్ల

దొంగలను పట్టించినా న్యాయం చేయడం లేదు



నా పొలం వద్దనున్న మోటారు, విద్యుత్ తీగలను దోచుకెళ్తున్నారని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు ఫిర్యాదుచేస్తే పట్టించుకోలేదు. రైతులందరం పొలాల వద్ద కాపలాకాసి మోటార్లు, తీగలను దోచుకెళ్లటానికి వచ్చిన దొంగలను పట్టుకొని ఎస్‌ఐకి అప్పగించాం. అయినా ఎస్‌ఐ దొంగలను విచారించి దోపిడికి గురైన విద్యుత్ మోటార్లు, తీగలను రికవరీచేయలేదు.

– చెన్నారెడ్డి, రైతు, తూడిచెర్ల

కేసులు నమోదు చేశాం



రైతులు పట్టించిన మోటార్ల దొంగలపై కేసులు నమోదు చేశాం. వారిని విచారించి వారిచ్చిన సమాచారం మేరకు ఓ మోటారును స్వాధీనం చేసుకున్నాం. అలాగే విద్యుత్ తీగల దొంగలను విచారించగా చిత్తుకాగితాలు ఏరుకునే వారని తేలింది. అయినా వారు ఎలాంటి దొంగతనాలకు పాల్పడకుండా వారిని బైండోవర్ చేశాం. ఎవరి వద్ద పైసలు వసూలు చేయలేదు. త్వరలో మోటార్లు స్వాధీనం చేసుకొని రైతులకు అప్పగిస్తాం

– వెంకటసుబ్బయ్య, ఎస్‌ఐ, జూపాడుబంగ్లా

సమస్యలపై ఎందుకు స్పందించ లేదు?



మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: మున్సిపల్ అధికారులు ప్రజల సమస్యలపై స్పందించడం లేదని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం పట్టణంలోని జై కిసాన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో అధికారులపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల అజెండాలో తీర్మానం చేస్తున్న సమస్యలను అధికారులు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ప్రతి నెల జరిగే సాధారణ సమావేశంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని నిలదీయడం బాధాకరంగా ఉందన్నారు. దీంతో సాధారణ సమావేశాన్ని మూకుమ్మడిగా బహిష్కరిస్తున్నామని కౌన్సిలర్లతో పాటు వెళ్లిపోయారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, డీఈ నబిరసూల్, ఏఈ బాణప్రకాష్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ బాలమద్దయ్య తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

టీడీపీకి గుణపాఠం చెబుతాం

నందికొట్కూరు: ముస్లింలను విస్మరిస్తున్న తెలుగుదేశం పార్టీకి గుణపాఠం చెబుతామని ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ జోన్ ఇన్‌చార్జి అబుబక్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత పిచ్చి పార్టీలతో పొత్తు పెట్టుకుంటే చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. చంద్రబాబు స్వార్థానికి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మారుస్తారన్నారు. ముస్లింలంతా ఏకమై టీడీపీకి తగ్గిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు అబ్దుల్ హమీద్, రవూఫ్, చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి

- నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేషస్పందన
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటి నుంచి టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో విశేషస్పందన లభించిందని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. జిల్లాలో టీడీపీ ఆధ్వర్యంలో లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్ర దినసరి కూలీలతో నడుస్తుందన్నారు.

86 శాతం పైగా ప్రజల మద్దతు జగన్‌కే

నియోజకవర్గంలోని 5 మండలాల్లో మొత్తం 67,432 ఇళ్ల వద్ద అభిప్రాయ సేకరణ నిర్వహించగా 86 శాతం పైగా ప్రజలు తమకే మిస్డ్ కాల్ ద్వారా ఎంతో అభిమానంతో మద్దతు ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు. సర్వేలో పాల్గొన్న గృహసారథులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పార్టీ మండలాల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, అంబాల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దేశం తిరుపం రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా పాలన

మిడుతూరు: రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు .. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. వారి అనుమతితో ఇళ్లకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. నాయకులు రాముడు, పేరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుండం గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలలను సార్థకం చేసుకోవాలి

పగిడ్యాల: కన్న కలలను సార్థకం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం అదనపు ప్రాజెక్ట్ మేనేజర్(ఏపీఎం) బి. శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో అధ్యక్షురాలు విజయమ్మ అధ్యక్షతన విజన్ బిల్డింగ్ రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నందికొట్కూరు క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ డేగలయ్య పర్యవేక్షించారు.

అర్హత ఉంటే చాలు..

ఆత్మకూరు: రాష్ట్రంలో కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కాలనీ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు గజమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నవరత్న పథకాలు అందిస్తూ ప్రజల హృదయాలను చూరగొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియామారూఫ్, పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రషీద్, 12వ వార్డు కౌన్సిలర్ అఫ్రజ్ జహా పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడిని నివారించండి

ఆత్మకూరు పట్టణంలో మంచినీటి ఎద్దడిలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డుల్లో ఎక్కడా నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, నిర్మాణానికి త్వరలోనే భూమిపూజ చేస్తామని చెప్పారు. మున్సిపాలిటీ పన్నుల రూపంలో రూ.3కోట్లు ఆదాయం సాధించిందని, మొత్తం విద్యుత్‌బకాయి చెల్లించి మరో 10 నెలల విద్యుత్‌బిల్లులను ముందుగానే జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం అజెండాలోని ఆరు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు పువ్వాడ దివ్య, రాజగోపాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధే లక్ష్యం

ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ తిరపాలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో నీటి సమస్య లేకుండా బోర్లకు మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన స్థలం ఇచ్చినందుకు కృతజ్ఞతలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జి.రమాదేవి

జూపాడుబంగ్లా: ఖరీదైన స్థలమిచ్చి, ఇంటిని మంజూరు చేసినందుకు గృహనిర్మాణ లబ్ధిదారులు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.రమాదేవి సమక్షంలో సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆమె జూపాడుబంగ్లాలోని జగనన్నకాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు పక్కన సెంటు కనీసం రూ.4లక్షల విలువచేసే స్థలాన్ని ఇవ్వడంతోపాటు ఇంటిని మంజూరు చేసి తమను ఓ ఇంటివారిని చేసిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటామని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూపాడుబంగ్లా జగనన్నకాలనీలో త్వరలో సిమెంటురోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయించి ఉమ్మడి జిల్లాలోనే మోడల్‌కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. డీఈ ప్రభాకర్, ఏఈ శ్రీనాథ్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



తిమ్మాపురం సమీపంలోని నేలకొరిగిన అరటితోట

జూపాడుబంగ్లా: శనివారం తెల్లవారుజామున నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పాములపాడు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో వర్షం దంచికొట్టింది. శనివారం తెల్లవారుజామున మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 42.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. జూపాడుబంగ్లాలో అత్యధికంగా 42.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కొత్తపల్లిలో అత్యల్పంగా 4.2 మిల్లీమీటర్ల నమోదైనట్లు తెలిపారు. నందికొట్కూరులో 29.4ఎం.ఎం, పగిడ్యాలలో 26.4ఎం.ఎం, మిడుతూరులో 7.4 ఎం.ఎం, పాములపాడులో 24.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

నేలకొరిగిన అరటితోటలు

మహానంది: అకాలవర్షాలతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇది చాలదన్నట్లు వరుణుడి ఆగ్రహంతో పాటు వాయుదేవుడు ఉగ్రరూపం దాల్చుతుండటంతో అరటిరైతన్నలకు ఆవేదన మిగులుతుంది. తాజాగా శనివారం మధ్యాహ్నం నుంచి వీచిన భారీగాలులకు పలు గ్రామాల పరిధిలో అరటిరైతులకు నష్టం వాటిల్లింది. మహానంది మండలం ఎం.తిమ్మాపురం, అబ్బీపురం, పుట్టుపల్లె, గాజులపల్లె, గోపవరం గ్రామాల్లోని రైతుల అరటితోటలు గాలిని నేలకొరిగాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో అరటిచెట్లు పడిపోవడంతో సుమారు రూ.అరకోటికిపైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథక సమాచారం. ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టంపై పూర్తి నివేదికలు రూపొందిస్తామని ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బండిఆత్మకూరు విద్యార్థుల్లో హిమోగ్లోబిన్‌శాతం పెరగాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. జనవరిలో ఈ పాఠశాలలో 80 శాతం మంది విద్యార్థినులకు హెచ్‌బీ శాతం తక్కువగా ఉండేదన్నారు. దీంతో ఐరన్ మాత్రలు పంపిణీ చేసి ఎవరెవరు ఎంత మోతాదులో వాడాలో సూచించినట్లు తెలిపారు. ఇందుకు తగిన విధంగా పాఠశాల సిబ్బంది ఐరన్ మాత్రలు ఇచ్చారన్నారు. అంతేకాక ప్రభుత్వం పాఠశాలల్లో పౌష్టికాహారం ఇవ్వడంతో విద్యార్థినుల్లో హెచ్‌బీ శాతం పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్, ఎస్‌ఓ అనురాధ, ఏఎన్‌ఎం పార్వతి, పాల్గొన్నారు.

బడికి సెలవులిచ్చారోచ్ !

జూపాడుబంగ్లా/మహానంది: పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించటంతో విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. జూపాడుబంగ్లా మండలంలోని సాంఘిక సంక్షేమశాఖ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, ఎస్సీబాలికల హాస్టల్, మహానంది మండలంలోని ఎం.తిమ్మాపురంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు వచ్చి ఇళ్లకు తీసుకెళ్లారు.

రేపు బండలాగుడు పోటీలు

మిడుతూరు: శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధాన మహోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలకు 6 పండ్ల వృషభరాజుల రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ. 40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు నగదు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే గుర్రం పందెం నిర్వహిస్తున్నామని, విజేతలకు వరుసగా 25 తులాల వెండి, 20 తులాల వెండి, 15 తులాల వెండి, 10 తులాల వెండి, 5 తులాల వెండి అందజేస్తామన్నారు. మే 2వ తేదీన గ్రామ కాడెద్దుల పందెం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ. 3 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తి

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేషస్పందన
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు : సీఎం జగనన్న పాలనలో అందిస్తున్న నవరత్న పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. మహిళా సాధికారత కోసం ప్రతి పథకం వారి పేరుపైనే విడుదల చేయడం హర్షించదగ్గ విషయన్నారు. 2014లో చంద్రబాబునాయుడు అనేక హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. అందుకే 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకు గుణపాఠం చెప్పారన్నారు.

హామీలు నెరవేర్చి ధైర్యంగా తిరుగుతున్నాం

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పజల్లోకి ధైర్యంగా తిరుగుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. పథకాలు కొనసాగించేందుకు మళ్లీ జగనన్నే సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తలపై ఉందని పిలుపునిచ్చారు. తమ నియోజకవర్గంలో 90 శాతం మంది సంతృప్తికరంగా ఉన్నట్లు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వెల్లడైందన్నారు. సమావేశంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు అబ్దుల్‌షుకూర్, రమాదేవి, రమణమ్మ, రామసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రఘురామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చలిమెల్ల వెంకటరమణ, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దిలీప్‌రాజ్, సింగ్‌విండో చైర్మన్లు హుస్సేనయ్య, హరిసర్వోత్తమ రెడ్డి,నారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మిడుతూరు/ఆత్మకూరు: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థినీ, విద్యార్థులకు మిడుతూరు, ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాళ్లు శంకర్ నాయక్, రఘురామాచార్యులు శనివారం తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ అయిన వారికి ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్య అభ్యసిస్తూ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ప్రత్యేక తరగతులకు హాజరుకావచ్చని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పగిడ్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండల టీం సభ్యులతో కలిసి నెహ్రూనగర్ జగనన్న లే అవుట్ కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించి, ఇంజినీర్లు సిఫారసు చేసిన ఐఎస్‌ఐ మార్క్ కలిగిన పైప్‌లనే వాడాలని పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల పవిత్రకు భంగం కలిగిస్తే చర్యలు

పగిడ్యాల: ప్రభుత్వం పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో ఎవరైనా వాటి పవిత్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాల మైదానాల్లో మద్యం సేవించడం, మల మూత్ర విసర్జనలు చేసి అపవిత్రత పరచడం, మద్యం సీసాలు పగులగొట్టి ప్లే గ్రౌండ్‌ను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. గ్రామాల్లో బీట్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా సచంరించిన సమీప ప్రజలు 9121101188 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

మహానంది: గాజులపల్లెలో మే 2,3వ తేదీల్లో పెద్దమ్మ దేవర సందర్భంగా విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో పనులు పర్యవేక్షించారు. ఏఈ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ. 20లక్షలు వెచ్చించి ఐదు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేశామన్నారు. అలాగే కొత్తగా ఆరు స్తంభాలు వేసినట్లు చెప్పారు. దీంతో పాటు 22 డ్యామేజీ పోల్స్ స్థానంలో నూతనంగా ఏర్పాటు చేశామని, 20 పోల్స్ దూరం సరిచేసినట్లు చెప్పారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



మృతి చెందిన ఈశ్వర్‌రెడ్డి సతీమణి లక్ష్మికి చెక్కు అందిస్తున్న ఈఓ, చైర్మన్లు

మహానంది: ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో సూపరింటిండెంట్‌గా పనిచేస్తూ అకాల మృతి చెందిన అన్నెం ఈశ్వర్‌రెడ్డికి రావాల్సిన గ్రాట్యుటీ మొత్తం రూ. 5.41లక్షలను శనివారం ఆయన సతీమణి లక్ష్మికి అందించారు. అలాగే ముప్పై ఏళ్ల పాటు విధులు నిర్వహించి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ముఖ్య అర్చకుడు లక్ష్మీనరసింహశాస్త్రికి అందాల్సిన రూ. 6.95లక్షల బెనిఫిట్స్ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

సున్నిపెంటలో చోరీలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో శుక్రవారం రాత్రి సెంట్రల్ లొకాలిటీ ఎలిమెంటరీ పాఠశాల సమీపంలోని విజయపాల డెయిరీ, మత్తేష్ హోటల్ షటర్ల తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఒక షాపులో రూ.10 వేల నగదు, మరో షాపులో రూ.2 వేల నగదు పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

కొనసాగిన జలదీక్ష

జూపాడుబంగ్లా: సార్..మా పొలాలకు సాగునీటినిచ్చి ఆదుకోవాలని మండలంలోని మండ్లెం గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వారు చేపట్టిన జలదీక్ష శనివారం నాటికి మూడోరోజుకు చేరుకుంది. నాగటూరు ఎత్తిపోతల పథకం ద్వారా మండ్లెం, తంగడంచ గ్రామాల పరిధిలోని పొలాలకు సాగునీరివ్వాలని రైతులు డిమాండ్ చేశారు.